

## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1631.90 | 1,617.37 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 10,203 | 1,825 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 10,176 | 9,728 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 101.38 | 54.27 |

## గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయవద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

**బళ్లారి సిటీ, అక్టోబరు 3:** గుండె సంబంధిత వ్యాధులపట్ల ఎలాంటి అశ్రద్ధ చేయొద్దని, వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు అన్నారు. కౌల్‌బజార్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుండె పోటు రావడం ఒక భయంకరమైన ప్రాణాపాయమన్నారు. రోజువారీ ఒత్తిడితో కూడిన జీవనశైలీలో మార్పు తెచ్చుకుని మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కుటుంబ సభ్యులకు గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లయితే లేదా అధిక రక్త పోటు, మధుమేహ వ్యాధి, నిరంతర ధూమపానం, అధిక స్థూలకాయం, మితమైన వినియోగం, అధిక కొలెస్ట్రాల్ ఉంటే గుండె సంబంధిత వ్యాధి త్వరగా రావచ్చు, కాబట్టి కనీసం 30నిముషాల సాధారణ సాధారణ వ్యాయామం చేయాలన్నారు. ధ్యానం సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం మంచిదన్నారు. వైద్యుల సూచన మేరకు నిత్యం మందులు తీసుకోవడంతో పాటు ఎప్పుడూ ఉల్లాసంగా ఉండడం వల్ల వ్యాధి దూరమవుతుందని తెలిపారు.

## రేపు జిందాల్‌కు వ్యతిరేకంగా పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రిస్వామి

**బళ్లారి సిటీ, అక్టోబరు 3:** రాష్ట్ర ప్రభుత్వం 3667 ఎకరాల భూమిని జిందాల్ కంపెనీకి అతి తక్కువ ధరకు విక్రయించడానికి నిరసనగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) బళ్లారి నుంచి తోరగణగల్లోని జిందాల్ ఓల్డ్‌గేట్ వరకు శనివారం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లాధ్యక్షుడు ఎర్రిస్వామి తెలిపారు. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర నగరంలోని రాయల్ సర్కిల్ నుంచి బయలుదేరి తోరణగల్లు పాత గేట్ వరకు సాగుతుందన్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బళ్లారి, విజయనగరం జిల్లాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కుడితిని ప్రాంత భూ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇళ్లులేని అర్హులైన లబ్దిదారుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సంస్థ జిల్లాకార్యదర్శి స్వామి, ఆఫీస్ బేరర్లు నవీన్, తిప్పేరుద్ర, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్లు నిండిన వాహనాలు నడపరాదు



మాట్లాడుతున్న ఆర్టీవో శ్రీనివాస్ గిరి..

**బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 3:** జిల్లా పరిధిలోని బళ్లారి, సిరుగుప్ప, కంప్లి, కురుగోడు, సండూరు తాలూకాలో రవాణా, రవాణేతర వాహనాల యజమానులు రవాణా శాఖకు చెల్లించాల్సిన వాహనం పన్నును వెంటనే చెల్లించాలని జిల్లా ప్రాంతీయ రవాణా అధికారి ఇ.ఎస్. శ్రీనివాస్ గిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనాల పన్నులు చెల్లించాల్సిన వారికి ఇప్పటికే పోస్టు ద్వారా నోటీసులు పంపినట్లు, నోటీసు అందిన వెంటనే పన్నులు చెల్లించాలని సూచించారు. చెల్లించని పక్షంలో మోటారు వాహన చట్టం ప్రకారం కోర్టులో కేసులు వేయాల్సి వస్తుందన్నారు. 15ఏళ్లు నిండిన ఆటో రిక్షాలు, పాఠశాల వాహనాల రిజిస్ట్రేషన్ రద్దుచేయాలని తెలిపారు.

# దుర్గా దుర్గతి నాశని!



గంగావతిలో కొలువుదీరిన దుర్గాదేవి



కనకదుర్గ ఆలయంలో బాలాత్రిపుర సుందరిగా..



కన్యకాపరమేశ్వరి ఆలయంలో రజత కవచంతో..



కంప్లిలో..



చిన్నదుర్గమ్మ ఆలయంలో ..

- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం
- మొదటిరోజు వివిధ రూపాలలో అమ్మవారి దర్శనం

హిందువుల ప్రధాన పండుగల్లో ఒకటైన దసరా శరన్నవరాత్రులు గురువారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తితన్మయత్వం పొందారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నగర ఆరాధ్యదేవత కనకదుర్గమ్మను మొదటి రోజున బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. ఈ అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే నగరంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో దేవికి వెండి కవచంతో ప్రత్యేక అలంకరణచేశారు. నగరంలోని ఏళుమక్కళ తాయికి విశేషాలంకరణ చేయగా, చిన్నదుర్గమ్మదేవికి బాలాత్రిపుర సుందరి అలంకరణ చేశారు. ఇలాగే నగరంలోని పలు దేవాలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణ నిర్వహించి భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించారు. గంగావతి పట్టణంలోని దేవాలయాల్లో అమ్మవారు సర్వాలంకృతులై గురువారం ఉదయం భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానంగా గంగావతి నగరవాసుల ఆరాధ్యదేవత దుర్గమ్మను రంగురంగుల పూలతో అలంకరించగా, గురువారం తెల్లవారుజామున దేవాలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగి పోయారు. హేమగుడ్డపై వెలసిన దుర్గా అమ్మవారు కూడా గురువారం నుండి ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. మైసూరు మాదిరిగానే హేమగుడ్డపై వెలసిన అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు శ్రీనాథ్ తెలిపారు.

### ఆడపిల్ల పుట్టిందని చెప్పి...

# మగశిశువు మృతదేహాన్ని చేతికిచ్చారు

● అయోమయంలో తల్లితండ్రులు... ఆసుపత్రి సిబ్బందిపై అనుమానం...



కొప్పళ ఆసుపత్రి డాక్టర్లు ఇచ్చిన చీటిని చూపుతున్న గౌరి దంపతులు

**బళ్ళారి గాంధీనగర్, అక్టోబరు 3:** ప్రసవ సమయంలో ఆడపిల్ల పుట్టిందని చెప్పిన డాక్టర్... 7 రోజుల తరువాత చనిపోయిన మగబిడ్డను చేతికివ్వడంతో ఒక్కసారిగా తల్లితండ్రులు షాక్‌కు గురయిన ఘటన కొప్పళ నగరంలోని వందపడకల ఆసుపత్రిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. విజయనగర జిల్లా, హగరిబొమ్మనహళ్ళి పట్టణానికి చెందిన గౌరి అనే ఏడు నెలల గర్భిణి హగరిబొమ్మనహళ్ళి ప్రసూతి ఆసుపత్రిలో చేరింది. అయితే ఆమెను పరీక్షించిన డాక్టర్లు కొప్పళ ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయడంతో అక్కడ సెప్టెంబరు 25న ఆమె ప్రసవించింది.

ఆమెకు ఆడపిల్ల జన్మించిందని, శిశువు బరువు తక్కువగా ఉండడంతో బిడ్డను తల్లికి సరిగా చూపకుండా ఐసీయూలో ఉంచారు. ఈ సందర్భంగా బిడ్డకు కామెర్ల వ్యాధి సోకిందని, ఐసీయులో వైద్యం అందిస్తున్నామని చెప్పిన డాక్టర్లు, బుధవారం ఉదయం ఉన్న ఫళంగా ఫోన్‌చేసి మీ బిడ్డ చనిపోయిందని, వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్ళమని చెప్పడంతో ఆసుపత్రికి చేరుకున్న గౌరి దంపతులకు అక్కడ మగపిల్లవాడి మృతదేహం కనిపించింది.. అయోమయంలో వారు ఆసుపత్రి డాక్టర్లను, సిబ్బందిని నిలదీశారు. ప్రసవం సమయంలో ఆడపిల్లని చెప్పిన వారే ఏడు రోజుల తరువాత చనిపోయిన మగబిడ్డను చేతికివ్వడం ఏమిటని డాక్టర్లను ప్రశ్నించారు. ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది తప్పిదం వల్లనే ఇలా జరిగిందని డాక్టర్లు మహిళను ఓదార్చే ప్రయత్నం చేసినా.. తమకు న్యాయం కావాలని భార్యభర్తలు ఇద్దరు ఆసుపత్రిలో ఉండిపోయారు. డాక్టర్ల మాటలపై విశ్వాసం లేకపోవడంతో తమకు న్యాయం జరిగేంత వరకు బిడ్డ మృతదేహాన్ని తీసుకెళ్లేదిలేదని మొండికేయడంతో ప్రస్తుతం ఆ శిశువు మృతదేహం శవాగారంలో ఉండిపోయింది. కొప్పళ జిల్లా ఆసుపత్రిలో నవజాత శిశువులపై జరుగుతున్న ఘటనలు వెలుగుచూస్తుండడంతో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యంపై ప్రజలు విశ్వాసం కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానిక ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వినియోగదారులకు మరిన్ని ఉత్తమ సేవలు

● బీఎస్ఎన్ఎల్ 25వ వార్షికోత్సవాలలో జీఎం సత్యానారాయణ



కేక్ కట్ చేస్తున్న జి.ఎం.సత్యనారాయణ తదితరులు

**బళ్లారి సిటీ, అక్టోబరు 3:** రాబోయే రోజుల్లో వినియోగదారులకు మరిన్ని ఉత్తమ సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని బిఎస్ఎన్ఎల్ జిఎం సత్యనారాయణ పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో సంస్థ 25వ వార్షికోత్సవ వేడుకలను ఆయన గురువారం కేక్ కట్‌చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన సంస్థ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. మారుమూల గ్రామాలకు సైతం సేవలను విస్తరించిన ఘనత బిఎస్ఎన్ఎల్‌కే దక్కుతుందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్ని సంస్థలు ఆవిర్భవించినా బిఎస్ఎన్ఎల్‌పై నమ్మకంతో తమ వినియోగదారులు కొనసాగుతున్నారన్నారు. అనంతరం సంస్థ కార్యాలయం నుంచి బైక్‌ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏజిఎం, డీజీఎం ఫ్రాంఛైజీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

# హోటళ్ళలో అంగన్‌వాడీ మసాలా పాకెట్లు



హోటళ్లలో దర్శనం ఇస్తున్న అంగన్‌వాడీ మసాలా పాకెట్లు

**గంగావతి రూరల్, అక్టోబరు 3:** జిల్లా పరిధిలోని కారటిగి పట్టణంలోని ఒక హోటల్‌లో అంగన్‌వాడీకి చెందిన మసాలా పాకెట్లు కనిపిస్తుండడం పట్ల కారటిగి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అందిస్తున్న తిండి దినుసులను సిబ్బంది బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకోవడంపట్ల పిల్లల తల్లితండ్రులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉదంతాలు అంగన్‌వాడీల నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతున్నాయని అంటున్నారు. గత నెల కొప్పళ జిల్లా కారటగి తాలూకా గుండురు గ్రామంలో అంగన్‌వాడీ పిల్లలకు ఇవ్వాల్సిన గ్రుడ్లు చేతికి ఇచ్చి లాక్కుంటున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేసిన విషయం పాఠకులకు విదిత మే...ప్రస్తుతం పిల్లలకు అందించే ఆహారంలో ఉపయోగించే మసాలా పాకెట్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో కాకుండా హోటళ్ళలో ప్రత్యక్షం కావడం పిల్లలకు సంబంధించిన ఆహార పదార్థాలు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయని చెప్పడానికి ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. కనుక బాధ్యులపై తగినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చేళ్లగుర్కి ఎర్రితాతకు విభూది అలంకరణ



**బళ్లారిరూరల్, అక్టోబరు 3 :** తాలుకాలోని చేళగుర్కి గ్రామంలో వెలసిన మహనీయుడు ఎర్రితాతకు నవరాత్రుల సందర్భంగా మొదటి రోజు విభూది అలంకరణ నిర్వహించారు. నవరాత్రి సందర్భంగా ప్రతినిత్యం వివిధ రకాల అలంకరణలు చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బాలనగౌడ్ తెలిపారు.

## జన ఔషధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జేఎన్ గణేష్

**కంప్లి, అక్టోబరు 3 :**ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. కంప్లి పట్టణంలోని సముదాయ ఆస్పత్రి ఆవరణలో జన ఔషధకేంద్రాన్ని ఎమ్మెల్యే గణేష్ ప్రారంభించారు. పేద కుటుంబాల రోగులు మందులు కొనడానికి జన ఔషధి కేంద్రం ఎంతో అనుకూలంగా వుంటుందని తెలిపారు. తక్కువ ధరలకే మందులు లభిస్తాయని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఈ కేంద్రం ఆస్పత్రి వద్ద ప్రజలకు అందుబాటులో వుంటుందన్నారు. వారితో పాటు ఏఎస్‌వో రమేష్‌బాబు, తాలుకా అధికారి అరుణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దివాకర్, జనఔషది కేంద్ర చెన్నగంటి మేఘనాథ్, పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి వేతనాలు పెంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజనం ఆయాలు

**సిరుగుప్ప, అక్టోబరు 3:** మధ్యాహ్న భోజనం పథకం కింద వంట చేసే ఆయాలకు రూ. 4 వేలు వేతనం ఇవ్వాలని జిల్లా మధ్యాహ్న భోజన పథకం సంఘం అధ్యక్షురాలు నాగరత్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో హైస్కూలు మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థకు మనవి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరత్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఎన్నికల ముందు వేతనాలు పెంచుతానని హామీ ఇచ్చారని ఇంతవరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### బాలాత్రిపురసుందరి అలంకరణలో తాయమ్మదేవి

శరన్నవరాత్రులు పురస్కరించుకుని సిరుగుప్ప పట్టణం ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి ప్రధాన అర్చకులు శ్రీనివాస అమ్మవారికి వివిధ పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. . అనంతరం ప్రసాద పంపిణీ చేపట్టారు.

# హోసూరు జోన్

## బస్టాండులో ఎక్కడ చూసినా వృద్ధులే!



ఎక్కడికెళ్లాలో తెలియక బస్టాండులో తలదాచుకున్న ఓ వృద్ధుడు

**హోసూరు అక్టోబరు 3 :** హోసూరు బస్టాండు నిరుపేదలకు అడ్డాగా మారింది, తమ బంధువులనుంచి దూరమైన వాళ్లు, పిల్లలు వదిలిపెట్టిన వృద్దులు ఎటూ వెళ్లలేక బస్టాండులో సేదదీరుతున్నారు. పారిశ్రామిక నగరంగా మారిన హోసూరులో వివిధ రాష్ట్రాలకు చెందిన కూలీలు కుటుంబాలతో అద్దె ఇళ్లలో ఉంటూ పనులు చేస్తున్నారు. విదేశీ కార్మికులు, ప్రయాణికుల రద్దీతో హోసూరు బస్టాండు 24 గంటలూ కిట కిటలాడుతూ రద్దీగా ఉంటుంది. ఈ రద్దీలో సుమారు 20 మందికి పైగా నిరుపేదలు బస్టాండుల్లో రాత్రి పగలు తేడా లేకుండా బట్టలు లేకుండా, తిండిలేకుండా దయనీయ స్థితిలో పడిఉంటున్నారు. వీరంతా హోసూరు బస్టాండు, రైల్వే స్టేషన్ సమీపంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తూ రాత్రి ఇలా బస్టాండుల్లో నిద్రిస్తున్నారు. వృద్ధులకు శారీరక గాయాలు ఏర్పడి నాకూడా ఆసుపత్రికి వెళ్లలేకపోతున్నారు. అదే విధంగా రాత్రి పూట వారు భిక్షాటన చేసిన డబ్బును దుండగులు రాత్రి పూట దోచుకెళ్లుతున్నారు. తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి వృద్దులను రక్షించి ప్రభుత్వం స్వచ్ఛంద సేవాకేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

### పన్ను వసూలు కేంద్రం ప్రారంభం

**హోసూరు అక్టోబరు 3:** హోసూరు రామనాయకన్ సరస్సు సమీపంలో గురువారం నూతన పన్నుల వసూలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్పొరేషన్‌లో 9 చోట్ల పన్నుల వసూలు చేయడానికి ఇప్పటికే కేంద్రాలు ఏర్పాటుచేశారు. ముఖ్యంగా హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రెండు పన్ను వసూళ్ల కేంద్రాలు, పాత మున్సిపల్ కార్యాలయంలో ఒక కేంద్రం, గాంధీ విగ్రహం సమీపంలో ఒక కేంద్రం, రైతు బసారు, మత్తిగిరి, మూకండపల్లి, జూజూవాడీలలో పన్ను వసూలు కేంద్రాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రామనాయకన్ సరస్సు సమీపంలో గురువారం ఏర్పాటు చేసిన నూతన పన్నుల వసూలు కేంద్రాన్ని హోసూరు మేయర్ సత్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

### దేవాలయాలలో దసరా పూజలు

**హోసూరు అక్టోబరు 3 :** స్థానిక నగరీశ్వర దేవాలయంలో నవరాత్రి సందర్భంగా పార్వతీ అమ్మవారికి వివిధ రాకాల అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, ఆరాధన, మహా దీపారాధన నిర్వహించారు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి పూజలు నిర్వహించి మహిళందరూ విష్ణుసహస్రనామం చదువుతూ అమ్మవారిని పూజించుకున్నారు. ప్రతి సంవత్సరంకూడా ఈ ఆలయంలో ప్రత్యేకించి దసరా సందర్భంగా పూజలు నిర్వహిస్తుంటారు.



నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పూజలందుకుంటున్న అమ్మవారు

# రాయచూరు బంద్ ప్రశాంతం



నిర్మానుష్యంగా మారిన రాయచూరు సెంట్రల్ బస్టాండ్

**రాయచూరు, అక్టోబరు 3 :** ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ దళిత సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు గురువారం నిర్వహించిన రాయచూరు జిల్లా బంద్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రం రాయచూరు నగరంతో పాటు సింధనూరు, మాన్వి, దేవదుర్గ, లింగసుగూరు, సిరవార వంటి పట్టణాల్లో సైతం బంద్ స్వచ్ఛందంగా సాగింది. వ్యాపార వేత్తలు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసి వేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వివిధ అవసరాల కోసం పట్టణాలకు వచ్చిన గ్రామీణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ బస్‌స్టాండ్ ప్రయాణీకులు లేక వెల వెల బోయింది. ఈ సందర్భంగా పోరాట సమితి ఐక్య వేదిక నాయకులు నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం, ఇచ్చినప్పటికీ సిద్ధరామయ్య ప్రభుత్వం అమలులో మీనమేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వర్గీకరణ అమలుకు సిద్ధం కావాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు హెచ్చరించారు. కాగా దళిత సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన బంద్ పిలుపు మేరకు నగరంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశారు.

## నేడు జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



**రాయచూరు, అక్టోబరు 3:** ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ నెల 4,5 తేదీల్లో జిల్లా పర్యటనకు రానున్నారని జిల్లాధికారి నితీశ్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని సింధనూరు నగరంలో దసరా నవరాత్రి ఉత్సవాలను సీఎం లాంచనంగా ప్రారంభిస్తారని 5వ తేదీన జిల్లా కేంద్రం వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో నిర్వహించనున్న గోకాక్ ఆందోళన 40 ఏళ్ల వార్షికోత్సవ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. గోకాక్ ఆందోళన 40వ వార్షికోత్సవ సందర్భంగా నగరంలోని చంద్రమౌళేశ్వర సర్కిల్ నుంచి ఉత్సవ నిర్వహణ జరిగే వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణ వరకు భారీ శోభాయాత్ర ఉంటుందన్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

### బస్టర్ కీటన్ (జయంతి)



క్లాజిక్ హాలీవుడ్‌లో పేరొందిన అమెరికాకు చెందిన నటుడు జోసెఫ్ ఫ్రాంక్ కీటన్ (బస్టర్ కీటన్) 1895 అక్టోబరు 4న జన్మించారు. కమెడియన్‌గా, సినీ దర్శకుడిగా, నిర్మాతగా, స్క్రీన్ రైటర్‌గా, స్టంట్ పర్‌ఫార్మర్‌గా రాణించారు. ప్రత్యేకించి మూకీ సినిమాలలో సత్తా చాటుకున్నారు. అభిమానులచే 'ది గ్రేట్ స్టోన్ ఫేస్'గా పిలవబడ్డారు. అకాడమీ హానరరీ అవార్డు గ్రహీత. 1966 ఫిబ్రవరి 1న కన్నుమూశారు. 2018 జూన్ 16న ఇంటర్నేషనల్ బస్టర్ కీటన్ సొసైటీ ఆయన గౌరవార్థం 'బస్టర్ కీటన్ డే'గా ప్రకటించింది.

### కమలాకర కామేశ్వరరావు (జయంతి)



అలనాటి తెలుగు సినీ దర్శకుడు 'పౌరాణిక చిత్రబ్రహ్మ'గా పేరొందిన కమలాకర కామేశ్వరరావు 1911 అక్టోబరు 4న మచిలీపట్నంలో జన్మించారు. మూడు దశాబ్దాలలో 55 సినిమాలకు దర్శకత్వం వహించారు. తొలుత కృష్ణా పత్రికలో 'సినీ ఫాన్' పేరిట ఆయన రాసే రివ్యూలు ప్రామాణికంగా ఉండేవి. ఆయన దర్శకత్వం వహించిన 'మహాకవి కాళిదాసు', 'మహామంత్రి తిమ్మరుసు' సినిమాలు నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రెసిడెంట్స్ సిల్వర్ మెడల్ సాధించాయి. 'గుండమ్మ కథ', 'నర్తనశాల' సినిమాలు ఎంతో పేరు తెచ్చాయి. 1998 జూన్ 29న కన్నుమూశారు.

### ఏడిద నాగేశ్వరరావు (వర్ధంతి)



ప్రముఖ సినీ నిర్మాత ఏడిద నాగేశ్వరరావు 1934 ఏప్రిల్ 24న తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో జన్మించారు. నాటక రంగం నుంచి సినీ నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ప్రవేశించి నిర్మాతగా స్థిరపడ్డారు. 'పూర్ణోదయ మూవీ క్రియేషన్స్' పతాకంపై ఉన్నత ఆశయాలతో నిర్మించిన శంకరాభరణం, స్వయంకృషి, సిరిసిరి మువ్వ, స్వాతిముత్యం వంటి సినిమాలు రికార్డు సృష్టించాయనడంలో సందేహం లేదు. తెలుగు సినీ నిర్మాతల కౌన్సిల్‌కు కార్యదర్శిగా, నంది పురస్కారాల కమిటీ అధ్యక్షుడిగా, జాతీయ పురస్కారాల సమితిలో సభ్యుడిగా వ్యవహరించారు. 2015 అక్టోబరు 4న కన్నుమూశారు.

### రిషబ్ పంత్ (పుట్టినరోజు)



క్రికెట్‌లో కుడిచేతి బౌలింగ్, ఎడమ చేతి బ్యాటింగ్ చేసే రిషబ్ రాజేంద్ర పంత్ 1997 అక్టోబరు 4న ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలో జన్మించారు. ఐపీఎల్‌లో ఢిల్లీ కేపిటల్స్ తరపున ఆడారు. 2022 దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరిగిన సిరీస్‌కు భారతజట్టు కేప్టెన్‌గా వ్యవహరించారు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా సత్తా చాటుకున్నారు. 2021లో ఉత్తరాఖండ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. బౌలింగ్ కుడిచేతి మీడియం ఫాస్ట్‌గాను, బ్యాటింగ్ ఎడమచేతి శైలి ఆయన ప్రత్యేకత. 2016లో అండర్-19 వరల్డ్‌కప్‌లో వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించారు. 18బంతులలో 50 పరుగులతో తన కెరీర్‌లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేశారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 308 పరుగులు తీసి థర్డ్ యంగెస్ట్ ఇండియన్‌గా గుర్తింపు పొందారు. రంజీ మ్యాచ్‌లలోనూ ఆడారు. 2024లో టి20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కించుకున్నారు.

# సిద్దరామయ్య రాజీనామా ఎందుకు చేయాలి..?



● జేడీఎస్ సీనియర్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** 'ముడా' వివాదంలో సిద్దరామయ్య సీఎం పదవికి రాజీనామా ఎందుకు చేయాలని, కేంద్రమంత్రి కుమారస్వామి కూడా రాజీనామా చేస్తారా అంటూ జేడీఎస్ పార్టీ సీనియర్‌నేత, ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ ప్రశ్నించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. జీటీ దేవెగౌడ వ్యాఖ్యలు ఇటు సొంతపార్టీలోనే కాకుండా కాంగ్రెస్‌లోను తీవ్రమైన చర్చకు కారణమయ్యాయి. గురువారం మైసూరులో దసరా ఉత్సవాల ప్రారంభంలో సీఎం సిద్దరామయ్యతో పాటు డీసీఎం, మంత్రులు, అధికారులు పాల్గొన్న సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ మాట్లాడుతూ ముడా వివాదంలో సీఎం రాజీనామా కోరేవారంతా పదవులకు రాజీనామా చేస్తారా అంటూ ప్రశ్నించారు. 'ముడా' వివాదంలో ఎవరెవరిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారో వారంతా రాజీనామాలు చేస్తారా అన్నారు. డిమాండ్ చేసేవారందరికీ చాముండేశ్వరీ దేవి మంచి బుద్ధి ప్రసాదించాలన్నారు. సీఎం రాజీనామా చేయాలని వాదించుకుంటూ పోతే రాష్ట్రంలోని రాజకీయ నాయకులంతా రాజీనామాలు చేయాల్సి ఉంటుందని ఇది సాధ్యమా అని ప్రశ్నించారు. ఇప్పటికే సీఎం భార్య 14 ఇంటి స్థలాలను వాపసు చేశారన్నారు. ముడా వివాదంపై దర్యాప్తు సాగుతోందని, అన్నింటికీ సీఎం సిద్దరామయ్య కారకులు కాదన్నారు. చట్టబద్ధంగానే 50:50 నిష్పత్తిన దక్కిన స్థలాలు కాదా అన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే రాజీనామా చేయాల్సిన అవసరం లేదన్నారు. మైసూరు నగరాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని ఇదే సందర్భంలో ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం జీటీ మీడియాతో మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదైతే రాజీనామా చేయాలా..? అని మాట్లాడానన్నారు. తనను కూడా విచారణ చేసుకోవచ్చునన్నారు. కోర్టు తీర్పు వచ్చేవరకు వేచి ఉండాలన్నారు. ఎవరు అక్రమంగా స్థలాలు పొందారనేది దర్యాప్తులో తేలుతుందన్నారు. చివరగా మాట్లాడిన సీఎం సిద్దరామయ్య పార్టీ వేరైనా ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ వాస్తవాలను మాట్లాడారన్నారు. ముడా సభ్యుడిగా అతడికి అంతా తెలుసన్నారు. సత్యానికి నిరంతరం విజయమేనని చాముండేశ్వరీ దేవి ఆశీస్సులతో ఐదేళ్ళు సీఎంగా కొనసాగుతానన్నారు. కాగా 2019 ఎన్నికలలో సిద్దరామయ్యను చాముండేశ్వరీ నియోజకవర్గం నుంచి ఓడించింది జీటీ దేవెగౌడ కావడం గమనార్హం.

### మైసూరు వాసిగా అలా మాట్లాడి ఉంటారు: కుమార

ముడా వివాదంపై సీఎం సిద్దరామయ్యకు వత్తాసు పలికేలా మాట్లాడిన జీటీ దెవెగౌడ తీరుపై కేంద్రమంత్రి కుమారస్వామి స్పందించారు. మైసూరు వాసిగా అలా మాట్లాడి ఉంటారన్నారు. ఇబ్బంది పడకుండా ఉండాలనే అటువంటి వ్యాఖ్యలు చేసి ఉంటారన్నారు. నేను సిద్దరామయ్య రాజీనామా ఎప్పుడూ కోరలేదన్నారు. ప్రతిరోజూ జరుగుతున్న పరిణామాలపై అలాంటి వ్యాఖ్యలు చేశానన్నారు.

## ఊరూరా దేవీ వైభవం



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మంజుల







చేళూరులో వాసవిమాతకు అలంకరణ, గిరినగర్‌లో బాణంతి అలంకరణ, దొడ్డజాల ముత్యాలమ్మదేవికి అలంకరణ

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** దేవీ శరన్నవ రాత్రులు ప్రారంభం కావడంతో బెంగళూరు సహ రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలలో గురువారం నుంచి విశేష పూజలు, అలంకరణలు చేస్తున్నారు. బెంగళూరులోని బనశంకరిదేవి మాత పసుపు కుంకుమ అలంకరణలో దర్శన మిచ్చారు. అంతర్జాతీయ విమానాశ్రయం దేవనహళ్ళి సమీపానగల దొడ్డజాలలోని ముత్యాలమ్మదేవి ప్రత్యేకించి పసుపు కుంకుమ అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గిరినగర్‌లోని వాసవి దేవి ఆలయంలో అమ్మవారికి బాణంతి అలంకరణ చేశారు. మేలుకోటె చలువరాయస్వామికి విశేషపూజలు చేశారు.

**మహదేవపుర:** నియోజకవర్గంలోని నల్లూరహళ్ళి మరియమ్మ దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మంజుళా లింబావళి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొనడం ద్వారా అమ్మవారి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నల్లూరహళ్ళి చంద్రశేఖర్, యోగేశ్ ఆరాధ్య, కేశవ, పెద్దసంఖ్యలో కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



శుద్ధతాగునీటి కేంద్రం ఆరంభంలో ప్రముఖులు

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై కనీసశ్రద్ధ వహించడం ముఖ్యమని శుద్ధతాగునీటితో ఉత్తమ ఆరోగ్యం, ఆరోగ్యవంతమైన వ్యక్తితో ఉత్తమ సమాజనిర్మాణం సాధ్యమని సముదాయ ఆరోగ్యకేంద్రం పాలనా వైద్యాధికారి డాక్టర్ బీఆర్ యువరాజ్ అభిప్రాయపడ్డారు. శ్రావణబెళగొళ పట్టణంలోని విద్యానంద నిలయ ఆవరణలో దిగంబరజైన మహాసంస్థాన మఠం ఆధ్వర్యంలో ఓల్వో గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో నూతనంగా నిర్మించిన శుద్ధతాగునీటి కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ యువరాజ్ మాట్లాడుతూ ఇటీవలికాలంలో ఫ్లోరైడ్‌నీటి వల్ల ప్రజలు పలు రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వీటికి నియంత్రణ చేయడం చారుకీర్తి భట్టారకస్వామి కలగా ఉండేదన్నారు. మఠం ప్రస్తుత పీఠాధ్యక్షుడు చారుకీర్తి భట్టారక పండితాచార్య వర్య మహాస్వామిజీ సాకారం చేశారన్నారు. 2006లో కేవలం 5పడకల ఆసుపత్రిని 30 పడకల సామర్థ్యానికి పెంచారన్నారు. గ్రామీణ ప్రాంత పిల్లల ఆరోగ్య దృష్ట్యా బాహుబలి పిల్లల ఆసుపత్రిని నిర్మించగా స్వామిజీపై అభిమానంతో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం స్వయంగా ప్రారంభించారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో తరచూ ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ మెరుగైన వైద్యం అందించడం అభినందనీయమన్నారు. శ్రావణబెళగొళ సమగ్ర అభివృద్ధికి మఠాధిపతి కట్టుబడడం ప్రశంసనీయమన్నారు. విద్య, ఆరోగ్య, ధార్మిక రంగాలలో సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఓల్వో గ్రూప్ సీఎస్ఆర్ విభాగం డైరెక్టర్ జీవీ రావ్ మాట్లాడుతూ తమవంతు బాధ్యతలో భాగంగా నిత్యం వేలాదిమంది యాత్రికులు విచ్చేసే శ్రావణబెళగొళలో శుద్ధ తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. బస్టాండ; సముదాయ ఆరోగ్య కేంద్రాలు ఉండడంతో ప్రయాణికులకు తదితరులకు అనుకూలం కానుందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు అఫ్తాబ్ పాషా, మాజీ అధ్యక్షుడు ఎస్ఆర్ లోకేశ్, ఎస్‌డీజేఎంఐఎంసి ట్రస్టు కార్యాధ్యక్షుడు హెచ్‌పీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి



తాడు లాగుడు పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

**శిడ్లఘట్ట, అక్టోబరు 3:** క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమని గ్రామీణ క్రీడల మనుగడకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర యువజనసంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫణీంద్రప్రసాద్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని అబ్లూడు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో జిల్లా పంచాయతీ, యువజనులు, క్రీడలశాఖ, రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య సంయుక్తంగా 2024-25 వార్షిక గ్రామీణ క్రీడోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో గ్రామాలలో అనేకరకాల బృందాల పోటీలు ఆడేవారన్నారు. ఆధునీకరణ, తదితర కారణాలతో గ్రామీణ క్రీడలు తగ్గుముఖం పట్టాయన్నారు. అయితే ప్రభుత్వ ప్రోత్సాహంతో మళ్లీ వాటికి ఊతం లభించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ మాట్లాడుతూ మనదేశంలో ప్రాచీనక్రీడలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ క్రీడాకారుడు జయంతి గ్రామానికి చెందిన నారాయణస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు నాగమణి దేవరాజ్, ఉపాధ్యక్షుడు బీకే డివి కుమార్, సహనా బ్లాక్ సొసైటీ అధ్యక్షురాలు భారతి ఆంజినప్ప, గంగాధర బిన్నమంగల తదితరులు పాల్గొన్నారు.

## లండన్‌లో సాంస్కృతిక సంబరం



వివిధ రంగాల సాధకులకు సన్మానం

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** నగరానికి చెందిన విశ్వఒక్కలిగ మహావేదిక ఆధ్వర్యంలో లండన్‌లోని కాంబర్‌వెల్‌లో నాడప్రభు కెంపేగౌడ మూడో అంతర్జాతీయ సాంస్కృతిక సంబరాన్ని కన్నడ ఉత్సవాన్ని ఇటీవల నిర్వహించింది. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామిజీ ముఖ్యులుగా పాల్గొన్నారు. కెంపేగౌడ ఐదు దశాబ్దాలక్రితమే బెంగళూరు నగరాన్ని నిర్మించారన్నారు. విశ్వవ్యాప్తంగా వేడుకలు జరపడం సంతోషమన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌జోషి మాట్లాడుతూ 7కోట్లమంది కన్నడిగుల ధ్వనిగా ఇక్కడ వేడుకలు జరపడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక మేయర్ మైమా అలి ముఖ్యులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, ఐఆర్ఎస్ అధికారి జయరాం రాయపురతోపాటు విశ్వ ఒక్కలిగ మహావేదిక అధ్యక్షుడు పైడి రవిశంకర్, మహిళా వేదిక అధ్యక్షురాలు భారతి శంకర్, కన్నడ అసోసియేషన్ తరపున సురేశ్ ఘట్టాపుర, హరీశ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నేపథ్యగాయని శమితమల్నాడ్ కచేరి నిర్వహించారు. వివిధ రంగాలలో రాణించినవారికి సత్కారం చేశారు. దివ్యరంగేనహళ్ళి డాక్టర్ రామానుజ, డాక్టర్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, యువన్‌దేవ్, హరీశ్‌రామయ్యలను సత్కరించారు. ఈ మేరకు నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం




సదస్సు వేదికపై ప్రముఖులు

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** వృద్ధుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరమని వారి మానసిక, యోగక్షేమాలు పరిరక్షించాల్సిన అవసరం ఉందని ప్రముఖ క్రికెటర్ సయ్యద్‌కిర్మాని అభిప్రాయపడ్డారు. నగరంలో సీనియర్ సిటిజన్‌ల మానసిక యోగక్షేమంపై జాతీయ చర్చాగోష్ఠి బెంగళూరు ఇంటర్నేషనల్ సెంటర్‌లో కరిస్టా ఫౌండేషన్, సనిఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యులుగా హాజరైన కిర్మాని మాట్లాడుతూ నగరాలు పెరిగినట్టే సమాజంలో మార్పులు యువత వలసలు జరుగుతున్నాయన్నారు. దీంతో వృద్ధాప్యంలో ఒంటరిగాను లేదా భార్యాభర్తలు మాత్రమే నివసించే పరిస్థితి బాధాకరమన్నారు. 2021 జనాభా లెక్కల ప్రకారం 60ఏళ్ల పైబడినవారు 1.04 కోట్లమందికిపైగా ఉన్నారని ఈ శాతం 9.4శాతం ఉండగా 2050 నాటికి 19.6శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. కిర్లోస్కర్ సిస్టమ్స్ ప్రైవేట్ సంస్థ ఛైర్మన్ గీతాంజలి కిర్లోస్కర్ మాట్లాడుతూ వృద్ధులకు అండగా ఉండాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. వయసు మాత్రమే కాకుండా వారి భవనలను అర్థం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కుటుంబం మద్ధతు ఉంటేనే వారి ఆలోచనలో పాజిటివిటీ సాధ్యమన్నారు. నిమ్హాన్స్ సెంటర్ ఫర్ కాన్సియస్‌నెస్ సీనియర్ రీసెర్చ్‌ఫెలో డాక్టర్ సాకేత్ ఎం ధ్యానా, కరిస్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అనిల్‌కుమార్, కో-ఫౌండర్ శిల్పిదాస్‌లతోపాటు నైటింగేల్స్ ఫర్ ఏజింగ్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ రాధా ఎస్ మూర్తి, థియేటర్ ఫర్ చేంజ్ ఫౌండర్ సుజాత బాలకృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

## పాఠకులు పెరిగేందుకు సీనియర్ల మార్గదర్శకం కీలకం

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** పత్రికారంగంలో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయని దశాబ్దాలక్రితం నాటి విధానాలు లేవని, పాఠకులు పెరిగేందుకు సీనియర్ పాత్రికేయుల మార్గదర్శకాలు కీలకమని 'విశ్వవాణి' ఎడిటర్ విశ్వేశ్వరభట్ అభిప్రాయపడ్డారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో టీఎస్ఆర్, మొహర్ పురస్కారాలు సాధించిన సీనియర్ పాత్రికేయులను ప్రత్యేకంగా సత్కరించారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్, ప్రెస్‌క్లబ్ ఆఫ్ బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విశ్వేశ్వరభట్ మాట్లాడుతూ సోషల్‌మీడియా ప్రభావంతో ప్రింట్‌మీడియాపై తీవ్రమైన పరిణామాలు చూపుతోందన్నారు. సామాన్యుడిగా వృత్తిజీవనాన్ని ప్రారంభించిన టీఎస్ఆర్ ప్రజావాణి పత్రికను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. మొహర్ సంయుక్త కర్ణాటకకు పునాదిలాంటివారన్నారు. వారిద్దరి పేరిట పురస్కారాలు సముచితమని అయితే ఏటా జరగాలని అభిప్రాయపడ్డారు. ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతికతకు అనుగుణంగా పాత్రికేయులు మార్పులు చెందాలన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు శివానంద తగడూరులతోపాటు ప్రెస్‌క్లబ్ జనరల్ సెక్రటరీ శివకుమార్ బెళ్లితట్టె ముఖ్యులుగా పాల్గొన్నారు. టీఎస్ఆర్ పురస్కార గ్రహీతలు శివాజి ఎస్, గణేశన్ శ్రీకాంతాచార్య మనూర, డాక్టర్ ఆర్ పూర్ణిమా, మొహర్ పురస్కార గ్రహీతలు ఇందూధర హొన్నాపుర, ఎన్ మంజునాథ్, చంద్రశేఖర్ పాలెత్తాడి, శివలింగప్ప దొడ్డమనెలను సత్కరించారు. మీడియా అకాడమీ సభ్యులుగా నియమింపబడిన పలువురిని సత్కరించారు.



పురస్కార గ్రహీతలకు సన్మానం

## బళ్లారిలో.. గాలికి ఘన స్వాగతం



అభిమానులకు గాలి కరచాలనం

**బళ్లారి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) :** పదమూడేళ్లపాటు బళ్లారికి దూరంగా వున్న గాలి జనార్దన్‌రెడ్డి ఎట్టకేలకు గురువారం బళ్లారిలో అడుగుపెట్టారు. ఉదయం ఎమ్మెల్యేగా గెలిపించిన గంగావతి నగరంలో పూజలు నిర్వహించిన ఆయన రోడ్డు మార్గంలో సాయంత్రం బళ్లారికి చేరుకున్నారు. అభిమానులు భారీగా విచ్చేసి బళ్లారి నగరం వరకు జనం బ్రహ్మరథం పట్టారు. ఊరేగింపుగా బళ్లారికి చేరుకుని కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం ఆయన ఇంటికి చేరుకున్నారు. అడుగడుగునా అభిమానులు పూలమాలలతో సత్కరించారు. అనంతరం బహిరంగ రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ పదమూడేళ్లపాటు బళ్లారికి దూరంగా వున్నానని, ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల ప్రకారం బళ్లారికి వచ్చినట్లు చెప్పారు. ఇక నుంచి బళ్లారి అభివృద్ధే తన ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు.

### బీజేపీలో ఐకమత్యంగా నడిపిస్తాం

ముడా కేసులో సీయం సిద్దరామయ్య వేల కోట్లు అక్రమాలకు పాల్పడ్డాడని ఆయన అక్రమాలకు పాల్పడిన డబ్బు మొత్తం తిరిగి చెల్లించాలని గాలి జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీలో ఐకమత్యంగా వుంటూ పార్టీని ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. సందూరు కుమారస్వామి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటానని తెలిపారు. సందూరు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుంటామని తెలిపారు. ఇదిలా వుంటే మాజీ మంత్రి శ్రీరాములు అనారోగ్యం కారణంగా గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

### రేపు పీఎం కిసాన్ సొమ్ము విడుదల

**అనంతపురం అర్బన్, అక్టోబరు 3:** పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్‌ను పురస్కరించుకొని శనివారం ప్రధాని నరేంద్రమోదీ ఈ ఏడాది రెండో విడతకు సంబంధించిన పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 27,9,161 మంది రైతులకు ఒక్కో రైతుకు రూ.2వేలు చొప్పున రూ.55.83 కోట్లను నేరుగా డీబీటీ ద్వారా ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు.

## పరిషత్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్



అభ్యర్థితో కాంగ్రెస్ నాయకులు

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** దక్షిణ కన్నడ స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థిగా రాజు పూజారి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం పార్టీ నేతలు మంజునాథ భండారి, ఐవాన్ డిసోజా, రమానాథరై, జయప్రకాశ్ హెగ్డే తదితరులు పాల్గొన్నారు. రాజు పూజారి మాట్లాడుతూ గ్రామపంచాయతీ, తాలూకా పంచాయతీ సభ్యుడిగా పనిచేశానని స్థానిక సంస్థల సమస్యలపై అవగాహన ఉందన్నారు. 30ఏళ్లుగా కాంగ్రెస్‌లో వివిధ హోదాలలో పనిచేశానన్నారు.

## తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** బీఈఎంఎల్ ఉద్యోగుల కుటుంబీకులు బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. బుధవారం బెమెల్ తెలుగు కళాసమితి సంబరాన్ని ఏర్పాటు చేసింది. కెజిఎఫ్‌కు అనుబంధంగా ఉండే బెమెల్స్ ఆఫీసర్స్ క్వార్టర్స్ ప్రాంగణంలో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మను తయారు చేసి వాటిని మోసుకొచ్చారు. క్వార్టర్స్‌లో బతుకమ్మలను కుప్పగా ఉంచి మహిళలంతా కోలాటంతో పాటు ఇతర గ్రామీణ సంప్రదాయ నృత్యాలు పాటలతో సందడి చేశారు. కార్యక్రమ నిర్వాహకులు శారద, నీరజ ఆధ్వర్యంలో జరిగిన సంబరాలలో పలు కుటుంబీకులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యంపై నేడు జాతీయ సదస్సు

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** నాల్గో విడత జాతీయ ఎండోస్కోపి సదస్సులో మహిళల ఆరోగ్యంపై శుక్రవారం ప్రత్యేక సదస్సు జరగనుందని రాధాకృష్ణ హాస్పిటల్ ముఖ్యులు డాక్టర్ విద్యాభట్ తెలిపారు. నగరంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 400మంది గైనకాలజిస్టులు భాగస్వాములవుతారన్నారు. ఎండోస్కోపిక్ సర్జరీలు పెంచే దిశగా సదస్సు జరగనుందన్నారు. 20మంది ప్రముఖ ఎండోస్కోపిక్ సర్జన్‌లు లైవ్‌లో శస్త్రచికిత్సలు జరుపుతారన్నారు. రాధాకృష్ణ ఆసుపత్రి ఆధ్వర్యంలో సమ్మేళనం జరుగుతోందన్నారు. దేశంలో 45వేలమంది గైనకాలజిస్టులు ఉండగా వీరిలో 8వేలమంది మాత్రమే ఎండోస్కోపిక్ నైపుణ్యం కలిగినవారు ఉన్నారన్నారు. వీరిసంఖ్య మరింత పెరగాల్సి ఉందన్నారు.

## వ్యక్తిగత స్వచ్ఛతపై దృష్టి సారించాలి : ఎమ్మెల్యే



దుస్తులు అందచేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

**బాగేపల్లి, అక్టోబరు 3:** పట్టణాన్ని గ్రామాలను స్వచ్ఛంగా ఉంచే పౌరకార్మికులు తమ వ్యక్తిగత స్వచ్ఛతపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పురసభ ఆవరణలో గురువారం పౌరకార్మిక దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పారి శుద్ధ పనులలో నిమగ్నమయ్యే కార్మికులు రోగాల బారిన పడకుండా ఉండాలంటే కనీస జాగ్రత్తలు పాటించాలని, అలాగే వ్యక్తిగత స్వచ్ఛత ఆరోగ్యాన్ని పట్టించుకోవాలన్నారు. పౌరకార్మికుల సేవలను ఎంతగా ప్రశంసించినా తక్కువేనన్నారు. విధులలో తప్పనిసరిగా గ్లవ్స్, షూస్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా 62మంది పౌర కార్మికులు, వాటర్‌మ్యాన్‌లకు దుస్తులు అందచేశారు. పురుషులకు ప్యాంట్, షర్టు, మహిళలకు చీర, రవికె అందజేశారు. పౌరకార్మికులకు తమవంతు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాసరెడ్డి, నంజుండప్ప, రేష్మాబాను, గడ్డం రమేశ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై కన్నడలోనూ రైల్వే పరీక్షలు: కేంద్రమంత్రి సోమణ్ణ

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కన్నడిగుల డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. కేంద్ర రైల్వేశాఖ నిర్వహించే అన్ని పరీక్షలను ఇకపై కన్నడలో రాసే అవకాశం ఉందని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమణ్ణ వెల్లడించారు. దావణగెరె జిల్లా అధికారి కార్యాలయంలో రైల్వే శాఖ నిర్వహించిన సమావేశంలో భూ స్వాధీన ప్రక్రియపై ఆయన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల సౌకర్యార్థం స్థానిక భాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపీ ప్రభా మల్లికార్జున, ఎమ్మెల్యే బీపీ హరీశ్, జిల్లాస్థాయి అధికారులు, అధికారులు పాల్గొన్నారు.


పసుపు, కుంకుమతో అలంకరణలో బనశంకరి మాత

# సంబరాలకు.. శ్రీకారం


చాముండేశ్వరి అమ్మవారు

- అంగరంగ వైభవంగా మైసూరు దసరా ఉత్సవాలు ప్రారంభం
- చాముండేశ్వరికి సీఎం, హంపనా పుష్పార్చన
- అమ్మవారి దయతోనే ఐదు సార్లు విజయం..
- ఆమె దయ ఉన్నంతవరకు పదవిలో ఉంటా: సీఎం సిద్దరామయ్య
- ఆకట్టుకుంటున్న ఫలపుష్ప ప్రదర్శన


మేలుకోటె చలువనారాయణస్వామికి అలంకరణ

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** శతాబ్దాలకాలంగా దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. సీఎం సిద్దరామయ్య, ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య చాముండి కొండపై చాముండేశ్వరి దేవి ఉత్సవమూర్తికి పుష్పార్చన చేసి నవరాత్రి వేడుకలకు శ్రీకారం చుట్టారు. మైసూరులో దాదాపు నెలరోజులుగా సాగుతున్న ఏర్పాట్లు అద్భుతంగా నిలిచాయి. కిలోమీటర్ల కొద్దీ విద్యుద్దీపాలు, గజరాజుల విన్యాసాలు, ఫలపుష్ప ప్రదర్శన, ఆహారమేళా, ఎగ్జిబిషన్ సెంటర్, యువదసరాతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకోసం ఏర్పాటు చేసిన వేదికలు ఆకట్టుకుంటున్నాయి. దసరా ఉత్సవాల ప్రారంభం తర్వాత ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు మహదేవప్ప, మునియప్పతోపాటు శాసనసభ్యులు భాగస్వాములయ్యారు.

### చాముండేశ్వరి ఆశీస్సులతో సంక్షేమాలు: సీఎం

నాడదేవత చాముండేశ్వరిదేవి ఆశీస్సులతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నానని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. సామాజికంగా, ఆర్థికంగా శక్తిని నింపే ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తున్నామన్నారు. గృహలక్ష్మి ద్వారా 1.2 కోట్ల మంది మహిళలకు నెలకు రూ.2వేలు, గృహజ్యోతి ద్వారా 1.40 కోట్లమందికి ఉచిత విద్యుత్, యువనిధి ద్వారా 1.82 లక్షలమందికి నిరుద్యోగ భృతి అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిశాయని, రైతులు సంతోషంగా ఉన్నారని, 99శాతం ఖరీఫ్‌లో విత్తనపనులు జరిగాయన్నారు. అందుకే మైసూరుదసరా ప్రజా పండుగ కావాలని పిలుపునిచ్చామన్నారు. సాహితీరంగంలో ఎంతో ప్రతిభ సాధించిన హంప నాగరాజయ్య ఉత్సవాలను ప్రారంభించడం సంతోషమన్నారు. ఆయనకు ఎప్పుడో అవకాశం లభించాల్సి ఉండేదన్నారు. ప్రజల ఆశీస్సులు, చాముండేశ్వరి దేవి కృప ఉండేవరకు పాలన సాగిస్తానన్నారు. ఇదే ప్రాంతం నుంచి ఐదుసార్లు గెలిచానని, మూడు సార్లు ఓడానని నాడదేవత ఆశీర్వాదంతో రెండోసారి సీఎం అయ్యానన్నారు.


సాహితీవేత్త హంప నాగరాజయ్యకు జ్ఞాపిక బహూకరణ

### చలన చిత్రోత్సవానికి శ్రీకారం

దసరాలో భాగంగా చలనచిత్రోత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఇమ్మావు గ్రామంలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఫిలింసిటీని అభివృద్ధి చేస్తామన్నారు. అదనంగా మరో 50ఎకరాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సినిమాలను ప్రజలు థియేటర్‌లలో చూడాలన్నారు. కన్నడ సినిమా రంగానికి ద్వారకేశ్ సేవలు మరువలేనివని, అందుకే ఈ ఏడాది ఆయన గౌరవార్థం ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక అతిథిగా నటుడు రమేశ్ అరవింద్ విచ్చేశారు. కాగా ఉద్యానవనశాఖ, మైసూరు కళాసంఘం ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శనను సీఎం లాంచనంగా ఆరంభించారు. ఫ్లవర్‌షోలో పార్లమెంటు నమూనా ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సాయంత్రం ఎగ్జిబిషన్ సెంటర్‌ను ప్రారంభించారు. దసరా కుస్తీ పోటీలకు శ్రీకారం చుట్టారు. దసరా సాంస్కృతిక సంబరాలను ప్రారంభించి రాష్ట్ర సంగీత విద్వాన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

క్రీడా పోటీలను భారత హాకీ జట్టు కెప్టెన్ అరమాన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. సీఎంతోపాటు దసరా ఉత్సవ కమిటీ ప్రీత్ సింగ్‌ను ప్రత్యేకంగా సత్కరించింది. ప్రీత్‌సింగ్ సాధనలు యువ క్రీడాకారులకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు 200 కుపైగా గోల్స్‌ను సాధించారని సీఎం ఆయన్ని కొనియాడారు. వచ్చే ఒలింపిక్స్‌లో బంగారు బహుమతి సాధించాలని కోరారు.


చాముండేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

### ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువులు

నగరంలోని బసవనగుడిలో భారీ ప్రమాణంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. మరోవైపు గరుడామాల్‌లోనూ వందలాది బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేయగా సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొలువులో ప్రధానంగా ఇతిహాసాలలోని పలు సన్నివేశాలకు సంబంధించి దేవతల నమూనాలు ఉన్నాయి. శ్రీమహావిష్ణువు అవతారంతోపాటు వివిధ దేవతల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పలు చోట్ల బొమ్మల కొలువులు తీర్చిదిద్దారు.


ఫ్లవర్‌షోలో సీఎం తదితరులు


ఫ్లవర్‌షోలో పార్లమెంటు నమూనా


ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువులు


### ప్యాలెస్‌లో యువరాజు ప్రైవేట్ దర్బార్


సింహాసనంపై యువరాజు యదువీర్

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** రాచనగరి మైసూరులో దసరా సంబరాలు ఆడంబరంగా ఆరంభమయ్యాయి. ఒడయార్ రాజకుటుంబం ఆధ్వర్యంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న దసరా సంప్రదాయానికి గురువారం శ్రీకారం చుట్టారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజవంశస్థులు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ పదోసారి బంగారు సింహాసనంపై ప్రైవేట్ దర్బార్ నిర్వహించారు. ఎంపీగా తొలిసారి కావడం విశేషం.

అంబా ప్యాలెస్‌లో తెల్లవారుజామున 5.30 గంటలకు నవరాత్రి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. బంగారు వజ్రఖచిత సింహాసనానికి సింహం రూపాన్ని అమర్చే ప్రక్రియ 5.45 గంటలకు ప్రారంభించారు. ప్యాలెస్ ప్రాంగణంలోని చాముండి విగ్రహానికి పూజలు జరిపారు. యువరాజు యదువీర్‌కు వాణివిలాస్ మందిరంలో భార్య త్రిషికాకుమారి కంకణధారణ చేశారు. పట్టపు ఏనుగు కంజన్, నిశాన్, భీమ, ప్యాలెస్ ఏనుగులు ప్రీతి, చంచల, పట్టపు గుర్రాలు, గోవులు, ఒంటెలకు సోమేశ్వర ఆలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత ఏనుగుల ద్వారాన్ని తెరిచారు. అనంతరం ప్యాలెస్‌లో వాటికి పూజలు చేసి యదువీర్ ఆశీర్వాదం పొందారు. దర్బార్ సభాంగణంలో నవగ్రహపూజల తర్వాత యదువీర్‌ను బహుపరాక్... బహుపరాక్ నినాదాలతో స్వాగతించారు. సింహాసనానికి ప్రదక్షిణలు చేసి 11 కళశాలతో పూజలు చేశారు. 11.35 గంటలకు సింహాసనంపై అధిరోహించి యదువీర్ ప్రైవేట్ దర్బార్ జరిపారు. అర్చకులు ప్యాలెస్ ప్రాంగణంలోని ఆలయాలు, నంజనగూడు శ్రీకంఠేశ్వర, శ్రీరంగపట్టణ రంగనాథస్వామి, చాముండేశ్వరి దేవి, ఉత్తనహళ్ళి మారమ్మ, మేలుకోటె చలువనారాయణస్వామి ఆలయంతోపాటు మొత్తం 23 ఆలయాలనుంచి తీసుకొచ్చిన తీర్థాన్ని యదువీర్ స్వీకరించారు. చాముండిదేవి విగ్రహాన్ని అద్దాలమేడలోకి తీసుకొచ్చారు. సింహాసనంపై నుంచి యదువీర్ నమస్కరించారు. సింహాసనం నుంచి దిగేముందు గౌరవవందనం చేశారు. రాజసంస్థానం గేయాన్ని ఆలపించారు. యదువీర్ తల్లి ప్రమోదాదేవికి పాదాభివందనం చేయగా, యువరాజుకు భార్య త్రిషికాకుమారి పాదపూజ చేశారు. ఇదే సమయంలో రాజవంశానికి చెందిన యదువీర్, త్రిషికాల కుమారుడు ఆద్యవీర నరసింహరాజ ఒడెయార్ తండ్రి యదువీర్ పాదాలకు పుష్పార్చన చేశారు. దీంతో తొలిరోజున పూజా కార్యక్రమాలు ముగిశాయి. ఈనెల 11 వరకు ప్రైవేట్ దర్బార్ కొనసాగనుంది. 12న విజయదశమి ప్రత్యేకపూజలు కొనసాగుతాయి.

# బాగురు కబ్బు కడి

- మండ్య జిల్లాలో నేడు చెరకు కోతల పోటీలు
- 'బాగురు కబ్బు కడి' పేరుతో తొలిసారి వినూత్నంగా ఏర్పాట్లు

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** దసరా, సంక్రాంతి పండుగలంటే గ్రామీణ క్రీడలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో ఎడ్లపందేలు, కోడిపందేలు వంటి వాటితోపాటు ప్రాచీనమైన క్రీడా పోటీలు జరుపుతారు. అయితే మండ్య జిల్లాలో ఈ సారి వినూత్న పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా చెరకు సాగు ఈ జిల్లాలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఎన్‌కే యువ బ్రిగేడ్ వినూత్నమైన పోటీలకు ఆహ్వానించింది. శుక్రవారం ఈ పోటీలను జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'బాగురు కబ్బు కడి' (హలో గురు చెరుకు కోతకు రండి) అనే పేరుతో పోటీలను చేపట్టారు. ఎన్‌కే బ్రిగేడ్ మద్దూరు, మలవళ్ళి ప్రాంతాల్లో రక్తదాన శిబిరం, సామాజిక సేవా కార్యక్రమాలు జరుపుతోంది. తొలిసారిగా చెరకు కోతల పోటీలను ప్రదర్శించేందుకు అన్నదాతల వారసులకు చాలెంజ్ చేస్తున్నారు. మద్దూరు తాలూకా కారకహళ్ళిలోని మహదేవ్ అనే రైతుకు చెందిన చెరుకుతోటలో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు దేశంలోనే తొలిసారి జరుగుతున్నట్లు ఎన్‌కే యువ బ్రిగేడ్ సంచాలకులు శివప్రసాద్ తెలిపారు. వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదని అదనపు జిల్లా అధికారి డాక్టర్ హెచ్ఎన్ నాగరాజ్ స్ఫూర్తితో ఈ ఆలోచన వచ్చిందన్నారు. గెలుపొందే జట్టుకు ప్రత్యేక బహుమతి అందిస్తామన్నారు. చెరుకు కోతల పోటీల్లో ఒక్కో జట్టులో ఆరుగురికి అవకాశం ఉంటుంది. వారికి 15నిమిషాలపాటు అవకాశం ఇస్తారు. చెరుకుగడలను నరికి కట్టలుగా కట్టిన వారికి మాత్రమే తూకం వేస్తారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండు, మూడు బహుమతులకు వరుసగా రూ.7,500, రూ.5వేలు ఇస్తామన్నారు. 4-8 స్థానాలకు రూ.2వేలు చొప్పున, 9-10 స్థానాలకు రూ.వెయ్యి చొప్పున ఇస్తామని ప్రకటించారు. గడువు తక్కువ ఉన్నందున ఎకరం భూమిని ఎంపిక చేశామన్నారు. పోటీలో పాల్గొనేందుకు ఎక్కువ జట్లు వస్తే సమీపంలోని పొలాల రైతులతో చర్చించి అవకాశం కల్పిస్తామన్నారు.


మండ్యలో సాగు చేసిన చెరకు పంట

## కెనరాబ్యాంకు మారథాన్ టీ షర్ట్ విడుదల

**బెంగళూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):** కెనరా బ్యాంకు రెండో ఏడాది బెంగళూరులో మారథాన్ జరిపేందుకు సిద్ధమైంది. గురువారం కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ కే సత్యనారాయణరాజు ప్రధానకార్యాలయం ప్రాంగణంలో టీ షర్ట్‌ను విడుదల చేశారు. నవంబరు 24న కెనరా బ్యాంకు రెండో ఎడిషన్ మారథాన్ ఉంటుందని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు భవేంద్రకుమార్, అశోక్‌చంద్ర, దేబశీశ్ ముఖర్జీ, హరదీప్‌సింగ్ అహ్లూవాలియాలు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ఎండీ, సీఈఓ మాట్లాడుతూ కెనరాబ్యాంకు ఉద్యోగులతోపాటు నగర ప్రజలతో కలసి మారథాన్ నిర్వహిస్తామన్నారు. ప్రతి మనిషి శారీరక ధృడత్వం, సమైక్యత, సంతోషకరమైన జీవనశైలి కొనసాగించాలనే నినాదంతో మారథాన్ ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాది 10వేలమందికిపైగా పాల్గొన్నారని, ఈ ఏడాది ఇప్పటికే 15వేలమంది పేర్లు నమోదు చేసుకున్నారని, కనీసం 20వేలమంది పాల్గొంటారని భావిస్తున్నామన్నారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో మారథాన్ ఉంటుందన్నారు. కెనరాబ్యాంకు ఉద్యోగులు భాగస్వాములయ్యారు.



మారథాన్ టీ షర్టు విడుదలలో కెనరాబ్యాంకు ఎండీ, సీఈఓ కే సత్యనారాయణరాజు తదితరులు



## నాకు నోటీసులు రాలేదు

- ముడా వివాదంపై మంత్రి బైరతి సురేశ్

**బెంగళూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):** ముడా ఇంటిస్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్య ఆప్తుడు, నగరాభివృద్ధి శాఖమంత్రి బైరతి సురేశ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసినట్లు వచ్చిన కథనాలపై స్పందించారు. మంత్రి సురేశ్ నగరంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఉదయం నుంచి పలు చానళ్ళు, సోషల్‌మీడియాలో ఈడీ నుంచి నోటీసులు వచ్చాయనే ప్రచారం సాగుతోందన్నారు. అయితే ముడా వివాదానికి సంబంధించి తనకు ఎలాంటి నోటీసులు రాలేదన్నారు. తన కార్యాలయం, తన ఇంటికి ఈడీ అధికారులు ఎవరూ రాలేదన్నారు. తాను ఎటువంటి తప్పు చేయలేదని, తనకు నోటీసులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. తనను రాజకీయంగా అవమానం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. చట్టపరంగా శాఖను నిర్వహిస్తున్నానని, ఇటువంటి తప్పుడు ప్రచారాలు ఎవరు సృష్టిస్తున్నారో తెలియదని, వారికి మంచి జరగాలన్నారు. అందుకు మంత్రి వివరణ ఇచ్చారు.

## సిద్దరామయ్య ఎందుకు రాజీనామా చేయాలి..?

- కుమారస్వామి కూడా చేస్తారా...?
- ప్రశ్నించిన జేడీఎస్ సీనియర్ ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ

7లో